International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-4, October-December, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# తెలుగులో అనువాద సాహిత్యం

డా॥ ఎల్లే విజయానందరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు. సెల్ : 94410 88634

**ఉపోద్ఘాతం :**

ఆంగ్ల భాషా ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అనేక నూతన సాహిత్య ప్రక్రియలు ప్రవేశించాయి. వాటిలో నవల, నాటకం, కథానిక, విమర్శ, స్వీయ చరిత్ర, జీవిత చరిత్ర, వ్యాసం, సమీక్ష, పీఠిక, పత్రికారచన, **అనువాదం** అనేవి ప్రధానమైనవి. వీటిలో **అనువాద సాహిత్య ప్రక్రియ** ద్వారా ఇతర భాషల నుండి తెలుగు భాషలోనికి అనువదించబడిన ముఖ్య **నవలలు, నాటకాలు, కథలు** మొదలగు వాటి గురించి రేఖామాత్రంగా విద్యార్థి లోకానికి పరిచయం చేయడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

**అనువాద నిర్వచనం :**

**'వద్'** అనే సంస్కృత ధాతువుకు **'అను'** ఉపసర్గ చేరి **'అనువాదం'** అనే పదం ఏర్పడింది. అనువాదం అంటే తిరిగి చెప్పడం అని అర్థం. ఒక భాషలోని పదం, పదాంశం, పదబంధం, వాక్యం, వాక్యాంగం, వాక్య సముదాయం వీటిలో దేనినైనా మరో భాషలోకి మార్చి చెప్పడం లేదా రాయడం **'అనువాదం'** అంటారు.

అనువాదం అనే పదం సంస్కృత పదం. దీనిని ఆంగ్లంలోని ట్రాన్స్‌లేషన్ (Translation) అనే పదానికి సమానార్థకంగా తెలుగులో వాడుతున్నాం. ట్రాన్స్‌లేషన్ పదం కూడా ఆంగ్ల పదం కాదు. అది లాటిన్ భాషాజన్యం. లాటిన్ భాషలో దీనికి **'అవతలికి వెళ్ళడం'** అనే అర్థముంది. అనువాద పదానికి ఇంకా **భాషాంతరీకరణ, తర్జుమా** అనే పర్యాయ పదాలున్నాయి. వీటిలో అనువాదం, భాషాంతరీకరణ సంస్కృత శబ్దాలు కాగా, తర్జుమా అనేది ఉర్దూ పదం. అయితే చలన చిత్రాల్లో ఈ అనువాదాన్ని **'డబ్బింగ్'** అంటారు.

తెలుగు నిఘంటువులు శబ్దరత్నాకరం, ఆంధ్రదీపిక, ఆంధ్రవాచస్పత్యము, వావిళ్ళ నిఘంటువు మొదలగునవి అన్నీ **'ఒకరు చెప్పిన దానిని మరల చెప్పుట'** అనే అనువాదానికి అర్థాన్ని చెప్పాయి.

అనువాదం చేయడానికి రెండు భాషలుండాలి. ఏ భాష నుండి గ్రహిస్తామో ఆ భాషని మూలభాష (Source Language) అని ఏ భాషలోనికి అనువాదం చేస్తున్నామో దానిని లక్ష్య భాష (Traget Language) అని అంటారు. ఉదాహరణకు సంస్కృతం నుంచి తెలుగులోనికి భారతం అనువాదం చేస్తే సంస్కృతం మూలభాష అవుతుంది. తెలుగు లక్ష్య భాష అవుతుంది.

**అనువాదం-ప్రయోజనాలు :**

అనువాదం ద్వారా ఒక భాషలోని సాహిత్యం మరొక భాషీయులకు తెలియజేయడానికి వీలుకలుగుతుంది. ఆధునిక కాలంలో అనువాదం ద్వారానే విజ్ఞానం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి అంటే, ఒక భాషా సమాజం నుంచి మరొక భాష సమాజానికి చేరుతుంది. వివిధ భాషల స్వరూప, స్వభావాలను, పలుకుబడులను ఆయా దేశాల సంస్కృతిని అనువాదం ద్వారా తెలుసుకోగలుగుతాము.

అంటే అనువాదాల ద్వారా వివిధ సాహిత్యాలను చదివి ఆనందించవచ్చు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని సంపాదించవచ్చు.

తెలుగు సాహిత్యం అనువాదంతోనే ప్రారంభమైంది. కవిత్రయ మహాభారతం వ్యాస భారతానికి అనువాద గ్రంథం. అప్పటి నుండి మొదలైన తెలుగు అనువాదం నేటి వరకు కొనసాగుతూ, అభివృద్ధి చెందుతున్నది. ప్రాచీన కాలంలో వచ్చిన అనువాదలన్నీ సాహిత్యపరమైనవి. కాని ఆధునిక కాలంలో సాహిత్య పరమైన అనువాదాలతో పాటు సాహిత్యేతర అనువాదాలు కూడా వచ్చాయి. ఉదాహరణకు శాస్త్రానువాదాలు, గణితానువాదాలు, రాజకీయానువాదాలు, సాంకేతికానువాదాలు, సాంఘికానువాదాలు, మనస్తత్వానువాదాలు, గణాంకానువాదాలు, చారిత్రకానువాదాలు, ఆర్థికానువాదాలు, వైద్యశాస్త్రానువాదాలు మొదలైనవి. ప్రాచీన కాలంలో వచ్చిన తెలుగు అనువాదాలకు మూలం సంస్కృత గ్రంథాలు. ఆధునిక కాలంలో వచ్చిన తెలుగు అనువాదాలకు మూలం ఆంగ్ల గ్రంథాలు. ప్రాచీనులు సంస్కృత పదాలను యథాతథంగా వాడుకున్నట్లే, ఆధునికులు ఆంగ్ల పదాలను యథాతథంగా వాడుకుంటున్నారు. అంతే కాకుండా హిందీ, తమిళ, మళయాల, కన్నడ, బెంగాలీ మొదలైన భాషలలోని గ్రంథాలు కూడా అనువదింపబడుతున్నాయి.

**అనువాద నాటకాలు :**

ఆధునిక యుగంలో సంస్కృత రూపకాలను యథాతథంగా అనువదించుటకు ప్రయత్నించిన వారిలో కోరాడ రామచంద్ర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు ప్రథములు. అయితే ఆంధ్ర వాఙ్మయ సూచికను బట్టి మనకు లభిస్తున్న మొట్టమొదటి సంస్కృత నాటకానువాదం యమ్. శేషాచార్యులు గారిచే 1870లో రచింపబడిన **'శాకుంతలము'.** ఆ తరువాత శ్రీ కోరాడ రామచంద్ర శాస్త్రి గారు **'వేణీ సంహార'** నాటకాంధ్రీకరణ చేశారు. కానీ అది అలభ్యం. వారే **'ఉన్మత్త రాఘవము'**ను అనువదించారు. ఇది ముద్రితం. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు 1871లో **'నరకాసుర విజయ వ్యాయోగము'**ను, 1894లో **'ధనంజయ విజయవ్యాయోగము'**ను, 1897లో **'ఆంధ్ర ప్రసన్న రాఘవము'**ను అనువదించారు. ఇవి ముద్రితాలు.

1877లో పరవస్తు వెంకట రంగాచార్యులు గారు కాళిదాసు **'అభిజ్ఞాన శాకుంతలము'**ను అనువదించారు. ఈ నాటకములోని రెండంకాలు మాత్రమే విశాఖపట్నం నుండి వెలువడి **'సకలాభివర్థిని'** పత్రికలో ప్రచురింపబడ్డాయి. ఆ తరువాత ఈ నాటకాన్నే 1876లో కందుకూరి వీరేశలింగం పంతులుగారు సమగ్రమైన శాకుంతలానువాదాన్ని రాజమండ్రి నుండి వెలువడిన **'వివేకవర్థినీ'** పత్రికలో ప్రచురించారు. మిగిలిన అనువాదాలలో వడ్డాది సుబ్బారాయు కవి **'వేణీ సంహారము' (1886), 'చండ కౌసిక నాటకము'(1900),** వావిలాల వాసుదేవ శాస్త్రి **'ఉత్తర రామచరిత్ర' (1889),** సుసర్ల అనంతరావు **'ముద్రారాక్షసము' (1890),** తిరుపతి వెంకట కవుల **'మృచ్ఛకటికము' (1890** కి పూర్వమే**), 'ముద్రారాక్షసము' (1908),** వేదం వెంకటరాయశాస్త్రి **'నాగానందము' (1891),** దాసు శ్రీరాములు గారి **'మహావీర చరిత్ర' (1902),** మల్లాది సూర్య నారాయణశాస్త్రి **'ఉత్తర రామచరిత్ర (1908),** బలజేపల్లి వారి **'ఉత్తర రాఘవము' (1910),** కస్తూరి సుబ్బారావుగారి **'శాకుంతలా దుష్యంతం' (1915),** వెంకట పార్వతీశ్వర కవుల **'విచిత్ర రాఘవం' (1933),** కంచనపల్లి జగన్నాథరావు గారి **'మాలతీ మాధవం' (1940),** వావిలాల సోమయాజులు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-4, October-December, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

**'వసంత సేవ' (1953),** గురజాడ శ్రీరామమూర్తి గారు **'మృచ్ఛ కటికం' 'ముద్రారాక్షసం'** పేర్కొనదగినవి.

సంస్కృత నాటకానువాదాలతోపాటు సమకాలికంగా ఆంగ్ల నాటకానువాదాలు కూడా తెలుగులో 19వ శతాబ్దికే ఆరంభమైనాయి. 1875లో వావిలాల వాసుదేవశాస్త్రి గారు షేక్స్పియర్ **'జూలియస్ సీజరు'**ను **'సీజరు చరిత్రము'** అను పేరుతో అనువదించారు. శ్రీ గురజాడ శ్రీరామ మూర్తిగారు **'మర్చంట్ ఆఫ్ వెనిస్'** అనే షేక్స్పియర్ నాటకాన్ని అనువదించారు. కందుకూరి వీరేశలింగం గారు **'కామెడీ ఆఫ్ ఎర్రర్స్'**ను అనువదించారు. షేక్స్పియర్ **'కింగ్ లియర్'** నాటకాన్ని చెన్నాప్రగడ భానుమూర్తి **'మందపాల చరిత్ర'**గా అనువదించారు. ఇలాగే బెంగాలీ, తమిళ, పంజాబీ మొదలగు అనేక భాషలలో నాటకాలు తెలుగులోనికి అనువదింపబడ్డాయి.

**అనువాద నవలలు :**

**'Novel'** అన్న ఆంగ్ల పదమే ధ్వని మార్పులు పొంది తెలుగు **'నవల'**గా పరిణమించింది. తెలుగులో అనువాద నవలలు 1900 సం॥ నుండి వెలువడ్డాయి. తెలుగులో వచ్చిన మొదటి నవల **'రాజశేఖర చరిత్రము'.** దీనిని వీరేశలింగం పంతులుగారు ఆంగ్ల నవల **'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్'** ప్రేరణతో రచించారు. ఆంగ్ల అనువాద నవలలో మొదటిగా చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి **'దాసీ కన్య'** చెప్పాలి. ఇది రమేశ్ చంద్ర దత్తు రాసిన 'Lake of Palms' నవలకు అనువాదం. ఇదే కాలంలో సర్ వాల్టర్ స్కాట్ ఇంగ్లీషు నవల **'ఐవన్హో'**ను కేతవరపు వేంకటశాస్త్రి గారు అనువదించారు. అటు తరువాత రమేశ్ చంద్ర దత్తు ఆంగ్ల నవల 'The Slave Girls of Agra' ను తల్లాప్రగడ సూర్య నారాయణ అనువదించారు. మెడోస్ టెయిలర్ **'టిప్పు సుల్తాను'** నవలను అక్కిరాజు ఉమాకాంతం అనువదించారు. ఛార్లెస్ డికెన్స్ **'ఏ టేల్ ఆఫ్ టు సిటీస్'**ను **'రెండు మహానగరాలు'** అను పేరుతో తెన్నేటి సూరి అనువదించారు. జోనాథన్ స్విఫ్ట్ **'గలివర్ ట్రావెల్స్'**ను కాళ్ళకూరి హనుమంతరావు **'గాలివరు నౌకాచరిత్ర'**లని అనువదించారు.

తెలుగులోనికి అనువాదం చేయబడిన నవలలో అధికశాతం బెంగాలి, హిందీ నవలలే ఎక్కువ. తెలుగులోనికి వచ్చిన తొలి అనువాద నవల ఒ.వై. దొరస్వామయ్య అనువాదం చేసిన **'కపాల కుండల' (1899).** బెంగాలీలో ఈ నవలను బంకించంద్రుని ఛటర్జీ రచించారు. తరువాత దొరస్వామయ్య బంకించంద్రుని **'ఆనంద మఠం', 'కమలా కోమలం'** నవలలను అనువదించారు. చాగంటి శేషయ్య, వెంకట పార్వతీశ్వర కవులు బంకించంద్ర ఛటర్జీ గారి ఇతర నవలలను తెలుగులోనికి అనువదించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ గారి **'గోరా', 'నౌకాయానం'** నవలలను ఒద్దిరాజు సోదరులు అనువదించారు. శరత్ చంద్ర ఛటోపాధ్యాయ **'బడదీదీ', 'దేవదాసు', 'దత్త', 'రాముని బుద్ధిమంతనం'** మొదలగు నవలలను వేలూరి శివరామశాస్త్రి అనువదించారు.

బెంగాలీ తరువాత హిందీ నుండి తెలుగులోనికి అధికంగా అనువాద నవలలు వచ్చాయి. హిందీ నుండి తెలుగులోకి అనువదింపబడిన నవలల్లో **'సేవా సదన్', 'గోదాన్', 'రంగభూమి', 'నిర్మల'** మొదలగు నవలలు ప్రేమ్‌చంద్ నవలలు కాగా, **'వోల్గా నుండి గంగవరకు', 'దివోదాసు', 'సింహసేనాపతి'** మొదలగున్నవి రాహుల్ సాంకృత్యాయన్ నవలలు.

తమిళం నుండి వచ్చిన వాటిలో సుబ్రహ్మణ్యం రాసిన **'అసుర గణం'** నవలను బి.వి. సింగరాచార్య

సభాపతులు అనువదించారు. జయ కాంతన్ రాసిన **'ఒరు నడిగైనాడగమ్ పార్కిరాళ్'** నవలను **'కళ్యాణి'** పేరుతో జిల్లేళ్ళ బాలాజి, పెరుమాళ్ మురగన్ రాసిన **'మదోరు బాగన్'**ను అర్ధ నారీశ్వరుడు పేరుతో ఎల్. ఆర్. స్వామి, **'అర్థనారి'** పేరుతో ఓల్గా అనువదించారు. కన్నడలో శ్రీనివాస్ రాసిన **'చిక్క వీర రాజేంద్ర'** మరియు ఎస్.ఎల్. భైరప్ప రాసిన **'పర్వ'**లను గంగిశెట్టి లక్ష్మీ నారాయణ అనువదించారు. అలాగే కన్నడ రచయిత్రి **'త్రివేణి పాప పరిహార'** నవలను తిరుమల రామచంద్ర గారు అనువదించారు. అలాగే మలయాళంలో తగళి శివ శంకర పిళ్ళై రాసిన **'రొయ్యలు', 'రెండు సేర్లు'** నవలలను జి. రామయ్య అనువదించారు. లలితాంబిక **'అగ్ని సాక్షి'** నవలను భక్త వత్సల రెడ్డి అనువదించారు.

ఉర్దూ నవలలు కొన్ని తెలుగులోకి అనువదింపబడ్డాయి. వాటిలో రాజేంద్ర సింగ్ రాసిన **'ఏక్ చాదర్ మైసిలీ'** నవలను కె. గోపాల కృష్ణారావు **'తెగిపోని బంధం'** పేరుతో అనువదించారు. కిషన్ చందర్ ఉర్దూ నవల గాడిద ఆత్మకథను పిచ్చేశ్వరరావు అనువదించారు. అబ్దుస్ సమద్ ఉర్దూ నవల 'దోగజ్ జమీన్'ను ముద్దసాని రామ్‌రెడ్డి **'అరడుగుల నేల'**గా అనువదించారు. అలాగే ఒరియా, గుజరాతీ మొదలగు అనేక భాషల నుండి తెలుగులోనికి అనేక అనువాద నవలలు వచ్చాయి.

**అనువాద కథలు :**

తెలుగులో మొట్ట మొదటి కథానిక రచయిత అయిన గురజాడ అప్పారావు గారే **'స్టూపింగ్ టురైజ్'** అను కథను ఆంగ్లంలో రాయగా, దానిని అవసరాల సూర్యారావు గారు **'సంస్కర్త హృదయం'** అనే పేరుతో అనువదించారు. గురజాడ తరువాత కథలు రాయడం మొదలు పెట్టిన వారు చాలా వరకు స్వతంత్ర కథలే రాసారు తప్ప అనువాదాల జోలికి పోలేదు. (ఉదా: చింతా దీక్షితులు మొ॥) ఆ తరువాత కాలంలో కథా సాహిత్యంపై అభిమానం పెంచుకున్న యువ రచయితలు హిందీ, బెంగాలీ, ఇంగ్లీషు భాషల్లో నుంచి తెలుగులోకి అనువాదాలు ప్రారంభించారు. వారిలో మాడపాటి హనుమంత రావు పంతులుగారు ప్రేమ్‌చంద్ కథలను తెలుగులోకి అనువదించారు. వేలూరి శివరామశాస్త్రి గారు బెంగాలీ కథలను తెలుగులోనికి అనువదించారు. ఆ తరువాత ఆంగ్లం నుంచి తెలుగులోనికి అనువాదాలు ప్రారంభమయ్యాయి. గురజాడ శ్రీరామమూర్తి అరేబియన్ నైట్స్‌లోని **'ది స్లీపర్ అవేక్డ్'**ని **'చిత్రరత్నాకరమ'**నే పేరుతో అనువదించారు. అలాగే మపాసా, లారెన్స్, చెకోవ్, లాట్ స్టాయ్, హెచ్.జి. వెల్స్, పెరల్ బక్ వంటి సుప్రసిద్ధ ఆంగ్ల కథకుల కథలను మన రచయితలు ఆంధ్రీకరించారు. అలాగే కందుకూరి వీరేశలింగం గారు కూడా అనేక కథల్ని ఆంగ్లం నుండి తెలుగులోనికి అనువదించారు.

గుణాద్యుడు పైశాచీ భాషలో రాసిన **'బృహత్కథ'**ను సోమదేవభట్టు సంస్కృతంలో అనువదిస్తే దానినే డా॥ విద్వాన్ విశ్వం **'కథా సరిత్సాగరం'** పేరుతో తెలుగులో అనువదించారు. ఇతర భాషల నుంచి అనువదించిన కథా సంపుటాలు కూడా చాలా ఉన్నాయి. ఉదాహరణకు మీ.ప. సోమసుందరం సంకలం చేసిన తమిళ కథలను చల్లా రాధాకృష్ణ శర్మ అనువాదం చేశారు. డాక్టర్ నామ్‌వర్ సింగ్ సంకలనం చేసిన హిందీ కథలను కుమారి జె. భాగ్యలక్ష్మి అనువాదం చేశారు. రాధా కృష్ణ సంకలనం చేసిన ప్రేమ్‌చంద్ కథలను అయాచితుల హనుమచ్ఛాస్త్రి అనువాదం చేశారు. అలాగే టి.ఎస్.కుమారస్వామి సంకలనం చేసిన బెంగాలీ కథలను మద్దిపట్ల సూరి అనువాదం, గుజరాతీ కథలను వి.నారాయణరావు అనువాదం,

చైనా–జపాను కథలను ఎన్. సుబ్రహ్మణ్యం అనువాదం, పాలగుమ్మి పద్మరాజు, కొడవటి కుటుంబరావులు చేసిన ప్రశస్తి ఆధునిక జర్మన్ కథానికలను చెప్పుకోవాలి.

అలాగే టాల్‌స్టాయ్ కథలను భమిటిపాటి కామేశ్వరరావు గారు, ఉర్దూ కథానికలను బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి గారు అనువదించారు. కె.ఎ.ఎన్. రావు రాసిన కన్నడ కథను భారతి మాసపత్రికలో **'పులి సిద్ధప్ప భార్య'** అను పేరుతో ప్రచురించారు. మొత్తం మీద ఇతర భాషల్లోంచి చెప్పుకోదగ్గ కథలు తెలుగులోనికి అనువదింపబడ్డాయి.

**ముగింపు :**

ఆధునిక యుగం వైజ్ఞానిక యుగం. నేడు అన్ని రంగాలలో వైజ్ఞానిక అభివృద్ధి కనిపిస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రంగాలలోను జరుగుతున్న అభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. వివిధ దేశాలలో, వివిధ భాషలలో, వివిధ రంగాలలో వెలువడుతున్న శాస్త్ర, సాహిత్య, ఇతర విషయాలను ప్రతి వ్యక్తి చదివి అర్థం చేసుకోవడం సాధ్యమయ్యే పనికాదు. కాబట్టి ప్రపంచ భాషలలో వెలువడుతున్న విషయాలను ఎప్పటికప్పుడు అన్ని దేశాలకు వ్యాపింపజేసే ఏకైక సాధనం అనువాదం. ఈ అనువాద ప్రక్రియ నిరంతరం పురోగమించాలి.

**ఆధార గ్రంథాలు :**

1. కుటుంబరావు, బి.వి. 1971. ఆంధ్ర నవలా పరిణామము. హైదరాబాదు: గాయత్రి ప్రచురణ.
2. చైతన్య, ఎ.వి.వి.కె. 2019. తెలుగులో అనువాద నవలలు – విమర్శనాత్మక అధ్యాయం. సిద్ధాంత వ్యాసం. అముద్రితం.
3. దక్షిణామూర్తి, పోరంకి. 1988. కథానిక స్వరూప స్వభావాలు. హైదరాబాదు: విశాలాంధ్ర ప్రచురణ.
4. నాగభూషణ శర్మ, మొదలి. 1971. తెలుగు నవలా వికాసం. హైదరాబాద్: శ్రీమతి పద్మజా భూషణ్.
5. శిరీష, ఈడ్పుగంటి. 2013. తెలుగులో అనువాద ప్రక్రియ. వ్యాస కౌముది.
6. శ్రీరామ అప్పారావు, పోణింగి. 1967. తెలుగు నాటక వికాసము. హైదరాబాదు: నాట్యమాలా ప్రచురణ.